## క్లుప్తంగా

### విశేష అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి




**పిడుగురాళ్ల :** హనుమజ్జయంతి పురస్కరించుకొని పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామికి ఆలయ పూజారులు విశేష అలంకరణ నిర్వహించారు. భక్తులు విశేషంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందించారు.

### అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



**మాచవరం:** గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, అల్లర్లకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అమీనుద్దీన్ హెచ్చరించారు. ఓటింగ్ లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాల్లోని అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

### విశేష పుష్పాలంకరణలో భక్తాంజనేయస్వామి



**సత్తెనపల్లి:** పట్టణంలోని మహా రాష్ట్ర వీధిలో గల శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో మూడవ రోజు ఆదివారం హనుమత్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పూలంగి సేవ చేశారు. భక్త సంగీత కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ప్రధాన సెంటర్లు నిర్మానుష్యం..



**క్రోసూరు:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం నుంచి ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తరువాత 5వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలలో ఉంటుందని ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. ముగ్గురుకి మించి రోడ్ల మీద గుమికూడదని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయోత్సవ సంబరాలు, ర్యాలీలు, బాణ సంచా పేల్చడం పూర్తిగా నిషిద్ధమన్నారు. తిరిగి ఆదేశాలు వచ్చే వరకు దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో క్రోసూరు ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. పోలీసుల మైకుల్లో ప్రచారంతో పాటు పలు కూడళ్లలో ఉదయం నుంచే పోలీసులు గస్తీ నిర్వహించారు.

### పకడ్బందీగా 144 సెక్షన్

**నకరికల్లు:** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యం, ఎగ్జిట్ పోల్స్ విడుదల కావడంతో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. శనివారం నుంచి పోలీసులు గ్రామాల్లో తిరిగి దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయించారు. ప్రజలను కూడా రోడ్లపై తిరగనివ్వడం లేదు. దీంతో ప్రధాన రహదారితో పాటు రోడ్లన్నీ బోసిపోతున్నాయి. వాహనాలు కూడా తక్కువగా తిరుగుతుండడంతో కర్ఫ్యూ వాతావరణం తలపిస్తోంది. కరోనా కాలం గుర్తు చేస్తోంది. ఈ సందర్భంగా నకరికల్లు ఎస్ఐ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

### ఇంటి పిట్టగోడపై పడిన పిడుగు

**యడ్లపాడు:** మండలంలోని ఉన్నవ గ్రామంలో ఓ ఇంటిపై పిడుగు పడింది. గ్రామంలోని సంగం డెయిరీ పాల సేకరణ కేంద్రం వద్ద ఉన్న గల్లా శ్రీనివాసరావు పక్కా ఇంటి పిట్టగోడపై ఆదివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో పిడుగు పడింది. దీంతో గోడ పాక్షికంగా దెబ్బతింది.

# రేపే తీర్పు



ఓట్ల లెక్కింపునకు పూర్తయిన ఏర్పాట్లు

- ఫలితాలపై ఉత్కంఠకు 24 గంటల్లో తెర
- 304 బూత్‌లు.. 14 టేబుళ్లు.. 22 రౌండ్‌లు
- 2019 ఫలితాలు పునరావృతమవుతాయనే చర్చ

**గురజాల :** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ పెరుగుతుంది. పట్టణాలు, పల్లెలు ఎక్కడ చూసినా కౌంటింగ్‌పై చర్చ. మరో 24 గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. గురజాల నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపునకు నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో అధికారులు కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 2019 ఏప్రియల్ 11వ తేదీన జరిగింది. వాటి ఫలితాల కోసం 41 రోజుల పాటు ఎదురుచూశారు. కానీ 2024 ఎన్నికలు మే 13వ తేదీన జరగ్గా జూన్ 4వ తేదీ కౌంటింగ్ అనగా 21 రోజుల్లో ఫలితాలు వెలువడుతున్నాయి.

### 2019 పునరావృతమయ్యేనా...

గురజాల నియోజకవర్గంలో గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం మండలాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కాసు మహేష్‌రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో ఆదరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం చేసి చూపించారు. ఆనాటి పరిస్థితులు మరలా పునరావృతం అవుతాయని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 2024లో కూడా ప్రజలు వైఎస్సార్‌సీపీనే ఆదరిస్తారని గెలుపు వైఎస్సార్‌సీపీదేనని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

**కౌంట్ డౌన్**

ఓట్ల లెక్కింపునకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు మొదలు కానుంది. ఫలితాలపై అటు అభ్యర్థులతో పాటు ఇటు ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గురజాల నియోజకవర్గంలోని 304 పోలింగ్ బూత్‌ల లెక్కింపు కోసం 22 రౌండ్‌లు.. ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కొరకు రెండు టేబుళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలలోపు విజయం ఎవరిని వరించింది అనే విషయం తేలనుంది. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఓట్లు వేశారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు భరోసాతో ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు వెళ్లడంతో పాటు పేద, మధ్య తరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, భరోసా, వంటి తదితర పథకాలు ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేశారు.

## పక్కాగా 144 సెక్షన్ అమలు



గురజాలలో నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్ ఏరియా



గురజాలలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

**గురజాల :** ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే అట్టి వారిపై చర్యలు తప్పవని సీఐ టి.బాలకృష్ణ అన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం సాయంత్రం నుంచి బుధవారం వరకు 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనవసరంగా ఎవరూ రోడ్లపైకి రావద్దని తెలిపారు. ఎవరైనా లెక్కింపు తరువాత గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే అట్టి వారిపై చర్యలు చేపడతామన్నారు. ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు.

**రహదారులు నిర్మానుష్యం...**

144 సెక్షన్ అమలులో ఉన్నందున రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉదయం 7 గంటల నుంచే కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. 144 సెక్షన్‌ను పోలీసులు కచ్చితంగా అమలు చేసేలా చర్యలు చేపట్టారు. రహదారులపై అనవసరంగా వాహనాలపై తిరుగుతున్న వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు సైతం 144 సెక్షన్ కారణంగా నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. బస్టాండ్ సెంటర్, గాంధీబొమ్మ, లక్ష్మీటాకీసు, శ్రీరాంపురం ఏరియాలు నిత్యం రద్దీగా ఉంటాయి. కానీ నేడు ఆ ప్రాంతాల్లో సైతం రద్దీ కనిపించలేదు.

## మరింత కఠినంగా 144 సెక్షన్



షాపులు మూతపడి నిర్మానుష్యంగా ఉన్న కొట్ల బజారు



మాచర్ల రోడ్డులో గస్తీ తిరుగుతున్న పోలీస్ బలగాలు

**కారెంపూడి:** కారెంపూడి ఆదివారం నిర్మానుష్యంగా తయారైంది. షాపులన్నీ పూర్తిగా మూతపడ్డాయి. ప్రజలు కూడా దాదాపు ఇళ్లకే పరిమితం అయ్యారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఒకటో తేదీ నుంచి 144 సెక్షన్‌ను స్థానిక అధికారులు మరింత కఠినంగా అమలు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ 4వ తేదీ జరగనుండడంతో ప్రజలు సంయమనంతో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌లకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు కారెంపూడితో పాటు మండలంలోని అన్ని గ్రామాలపై పోలీసులు నిఘా పెట్టారు. ప్రతి గ్రామంలో పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. గ్రామాలలో కూడా ప్రజలను గుమికూడి ఉండవద్దని హెచ్చరిస్తున్నారు. కారెంపూడిలో పోలీస్‌లు గస్తీ తిరుగుతున్నారు. ప్రధాన కూడళ్లలో కేంద్ర భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాకపోకలపై పూర్తిస్థాయి పోలీస్ నిఘా కొనసాగుతోంది. ప్రతి ఆదివారం అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులు తప్ప మిగతా జన సంచారం స్తంభించిపోయింది.

## ప్రశాంత వాతావరణంలో పిడుగురాళ్ల

- 144 సెక్షన్‌తో షాపులన్నీ బంద్
- వెలవెలబోతున్న రహదారులు



పిడుగురాళ్లలో షాపులు మూసివేయడంతో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

**పిడుగురాళ్ల:** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణంలో 144 సెక్షన్ అమలు చేయటంతోపాటు వ్యాపార సముదాయాలన్నీ బంద్ చేయించారు. దీంతో ఆదివారం పిడుగురాళ్ల పట్టణం మొత్తం నిర్మానుష్యంగా మారింది. మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరగనుంది. పల్నాడు ప్రాంతంలో ఎక్కడా గొడవలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాలతో 144 సెక్షన్ అమలుతో పాటు వ్యాపార సముదాయాలన్నీ మూసి వేశారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎవరూ గొడవలు పడకుండా, ప్రతి ఒక్కరు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నడుచుకోవాలని.. 144 సెక్షన్ పూర్తి స్థాయిలో అమలులో ఉంటుందని పోలీస్ అధికారులు తెలిపారు. మద్యం షాపులు కూడా ఈ నెల 5వ తేదీ వరకు బంద్ కానున్నాయి. మొత్తం మీద అన్ని విధాలుగా అల్లర్లు, గొడవలు లేకుండా.. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ముందు జాగ్రత్త చర్యలు పోలీస్ యంత్రాంగం చేపట్టింది.

### 92 శాతం పెన్షన్ల పంపిణీ



**నాదెండ్ల:** మండలంలోని 16 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పెన్షన్లు ఆదివారం సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. మండల పరిధిలో 9,659 మంది లబ్ధిదారులకు గాను రూ.2,86,49,000 పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండగా, ఇందులో 2,440 మందికి గాను పెన్షన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 7,219 మందికి సచివాలయ సిబ్బంది శనివారం నుంచి పంపిణీ చేస్తున్నారు. సుమారు 92 శాతం పైగా పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఆదివారం బ్యాంకులకు సెలవు దినం కావటంతో సోమవారం నుంచి 5వ తేదీ వరకూ పెన్షన్ సొమ్మును ఖాతాల నుంచి డ్రా చేసుకోవచ్చని తెలిపారు.

### ప్రశాంతతకు ప్రజలు సహకరించాలి

స్పెషల్ డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు



**రెంటచింతల:** ప్రజల్లో మనోధైర్యం కల్పించేందుకు పోలీసు ప్రత్యేక బలగాలతో గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్నామని.. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఏర్పడటానికి ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని స్పెషల్ డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు కోరారు. ఈ నెల 13న నిర్వహించిన ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఆదివారం రెంటచింతల, మిట్టగుడిపాడు గ్రామాలలో ప్రజలకు మనోధైర్యం కల్పించడానికి పోలీసులతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు గ్రామ పురవీధుల్లో ఫ్లాగ్ మార్చ్ (కవాతు) చేస్తూ ప్రజలకు మనో ధైర్యం కల్పించి వారు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలలో ప్రజలను ఇబ్బంది పెట్టినా, దౌర్జన్యం చేసినా.. వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాలలో గాలింపు (కార్డన్ సెర్చ్) చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

### 5వ తేదీ వరకు వాణిజ్య సంస్థలు తెరవరాదు

ఎస్ఐ వెంకట్రావు

**వెల్దుర్తి:** ఎన్నికల ఫలితాలు ఈ నెల 4న వెలువడనున్న నేపథ్యంలో నేటి నుంచి ఈ నెల 5 వరకు ఎటువంటి వాణిజ్య సంస్థలు తెరవరాదని.. సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఆదివారం ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఎటువంటి హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫలితాల అనంతరం మండల వ్యాప్తంగా ర్యాలీలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధంలో ఉన్నాయని, విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా పార్టీల నాయకులు తమకు సహకరించాలని కోరారు. సమస్యాత్మక గ్రామాలలో కేంద్ర బలగాలతో శాంతిభద్రతలకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే వారిపై పీడి యాక్టు, రౌడీషీటు ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా యువత గొడవలలో పాల్గొని తమ జీవితాలను పాడుచేసుకోవద్దన్నారు. అటువంటి వారిపై వారి తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని కోరారు. మండల కేంద్రమైన వెల్దుర్తి, అన్ని గ్రామాలలో నిత్యావసర వస్తువులు తప్ప ఇతర వాణిజ్య షాపులు తెరవకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు, ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ జగదీష్ నాయక్



దాచేపల్లిలో కవాత్ నిర్వహిస్తున్న పోలీసులు



దాచేపల్లిలో దుకాణాలు మూసివేసిన దృశ్యం

**దాచేపల్లి :** ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జగదీష్ నాయక్ హెచ్చరించారు. దాచేపల్లి నగర పంచాయతీతో పాటు పలు గ్రామాల్లో పోలీసులు ఆదివారం పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జగదీష్ నాయక్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. 144 సెక్షన్ పక్కాగా అమలు చేసేందుకు ముందస్తుగానే అన్ని దుకాణాలు మూసివేయించామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఫలితాల అనంతరం ఏ రాజకీయ పార్టీ ర్యాలీలు, ఊరేగింపులు చేసేందుకు అనుమతులు లేవని, సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో పోస్టులు పెడితే సంబంధిత అడ్మిన్‌పై చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఫలితాలు ఏ విధంగా వచ్చినా ఉద్రేకాలకు.. విద్వేషాలకు వెళ్లి ఇబ్బందులు పడవద్దని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని డీఎస్పీ జగదీష్ నాయక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.సురేంద్రబాబు, ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

**మూతపడిన దుకాణాలు**

144 సెక్షన్ అమలు సందర్భంగా దాచేపల్లి నగర పంచాయతీలో అన్ని రకాల దుకాణాలు మూసివేశారు. నిత్యం రద్దీగా ఉండే కొట్ల బజార్ 144 సెక్షన్ అమలుతో నిర్మానుష్యంగా మారిపోయింది. పోలీసుల ఆంక్షలతో ప్రజలు ఇంటికే పరిమితం అవుతున్నారు. సీఐ సురేంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఫలితాల తర్వాత అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చి వాటి ద్వారా ప్రజల కదలికలను నిశితంగా పరిశీలన చేస్తున్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కోసం పోలీసులు ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

ప్రత్యేక డీఎస్పీ లక్ష్మణరావు



పిన్నెల్లిలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

**మాచవరం:** ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని మండల స్పెషల్ డీఎస్పీ ఎం.లక్ష్మణరావు హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పోలీసుల విధులకు ప్రజలు సహకరించాలన్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటళ్ల నిర్వహణకు అనుమతులు లేవన్నారు. ప్రజలు గుంపులుగా చేరితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు, వాహనాలు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. మండలానికి ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేసామన్నారు. పోలీసులు విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆక్టోపస్ ఎస్పీ నాగేంద్రరావు, సీఐ శివన్నారాయణ, ఎస్ఐ దస్తగిరి, మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్, ప్రత్యేక పోలీస్ బలగాల సిబ్బంది, పాల్గొన్నారు.

## పోలీసుల నిర్బంధంలో రెంటచింతల

- రెంటచింతల మండలంపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- జన సంచారం లేక వెలవెలబోయిన వీధులు



నిర్మానుష్యంగా ఉన్న రెంటచింతలలో ప్రధాన రహదారి

**రెంటచింతల:** మండలంలోని తుమృకోట, పాలువాయి జంక్షన్, రెంటాల, జెట్టిపాలెం గ్రామాలలో మే 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన ఘటనల మేరకు స్పెషల్ డీఎస్పీ పి.వెంకటేశ్వరరావు నేతృత్వంలో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ నెల 4న నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రెంటచింతల పూర్తిగా పోలీసుల నిర్బంధంలో ఉంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో తుమృకోట, పాలువాయిగేటు, జెట్టిపాలెం గ్రామాలలో ఈవీఎంలు ధ్వంసం చేయడాన్ని ఈసీ సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా దళాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం రెంటచింతలలో వ్యాపార సంస్థలను ఉదయం నుంచి మూసివేశారు. గ్రామాలలో ఘర్షణలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రతి గ్రామంలో 10 నుంచి 20 మంది ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామాలకు ఒక మొబైల్ పార్టీ (ఒక ఎస్ఐ నలుగురు సిబ్బంది)తో కలిసి అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని మైక్ ద్వారా ప్రజలను హెచ్చరించింది. మెడికల్ షాపులు మాత్రమే తెరచి ఉంచారు. రెంటచింతలలో అడుగడుగునా పోలీసులు మోహరించడంతో గ్రామస్తులు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో గ్రామంలోని వీధులన్నీ కర్ఫ్యూని తలపించేలా నిర్మానుష్యంగా ఉన్నాయి. మండలంలో మొత్తం 260 మంది ప్రత్యేక దళాలు, పోలీసులతో శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నట్లు ఎస్ఐ ఎం.ఆంజనేయులు తెలిపారు.

## కంకర రాళ్లు, కర్రలు లేకుండా చర్యలు తీసుకోవాలి

**నరసరావుపేట రూరల్:** గ్రామాల్లో బహిరంగ ప్రాంతాల్లో కంకరరాళ్లు, కర్రలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఈఓపీఆర్డీ కేవీ ప్రసాద్ సూచించారు. మండలంలోని పెట్లూరివారిపాలెంలో ఆదివారం పర్యటించారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రదేశాలను సందర్శించి గృహ యజమానులకు పలు సూచనలు చేశారు. గృహ నిర్మాణాల వద్ద కంకరరాళ్లు, కర్రలు అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా ఘర్షణలు జరిగితే సంబంధిత గృహ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంకర రాళ్లు, కర్రలు రోడ్ల వెంట లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

## నాటు సారా స్వాధీనం

**నకరికల్లు:** మండలంలోని చేజర్ల గ్రామంలో తరలిస్తున్న నాటు సారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు ఆదివారం తెలిపారు. గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. బాణావత్ రామకృష్ణ నాయక్, నందినాయక్, బాణావత్ శివానాయక్, బాణావత్ శంకర్‌నాయక్ కలసి నాటు సారా తీసుకెళ్తుండగా.. అదుపులోకి తీసుకునేందుకు గట్టి ప్రయత్నం చేసినట్లు తెలిపారు. వారిలో బాణావత్ రామకృష్ణ నాయక్‌ను అదుపులోకి తీసుకోగా మిగిలిన ముగ్గురు పరారైనట్లు పేర్కొన్నారు. అతని వద్ద ఉన్న 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దారిదోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

**నరసరావుపేట టౌన్:** దారి దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సిహెచ్.కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. పమిడిపాడు గ్రామానికి చెందిన వల్లెపు శివ తాపీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. పనుల నిమిత్తం బెంగళూరు వెళ్లి గత నెల 20వ తేదీ తెల్లవారు జామున నరసరావుపేటకు రైల్లో వచ్చాడు. స్టేషన్ నుంచి కోట సెంటర్‌కు నడిచి వెళ్తుండగా మార్గమధ్యంలో గాంధీ పార్కు వద్ద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి అతని వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్ అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సమీపంలోని చెప్పుల దుకాణం వద్ద లభించిన సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు కొండలరావుపేటకు చెందిన జాజం సంతోష్ కుమార్, వరవకట్టకు చెందిన షేక్ జమీర్ మీరావలి పాత నేరస్తులుగా గుర్తించారు. దీంతో వారిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా పై నేరాన్ని వారే చేసినట్లు అంగీకరించి దోచుకున్న సొత్తును పోలీసులకు అప్పగించారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.